క్లుప్తంగా

9న 'మనూ'లో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ది మౌలానా ఆజాద్ చైర్ (ఎంఏసీ) ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో 'ది స్టోరీ అండ్ ప్రీ హిస్టరీ ఆఫ్ ఉర్దూ', 'దక్షిణి: ఏ హైబ్రిడ్ ల్యాంగ్వేజ్ ఆఫ్ ది బోర్డర్‌ల్యాండ్స్' అనే రెండు అంశాలపై హర్యానాలోని అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ పెగ్గి మోహన్ మాట్లాడతారు.

నల్లగండ్లలో స్టూడియో 11 ప్రారంభం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో స్టూడియో 11 స్పాను ప్రభుత్వ విప్ గాంధీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ యువత అభిరుచులకు అనుగుణంగా సేవలందించాలన్నారు.కార్యక్రమంలో నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షుడు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు, బీఆర్ఎస్ నాయకులు కోమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేవీ విద్యార్థులకు అన్యాయం జరగనివ్వం

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు అన్యాయం జరుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2013లో హెచ్‌సీయూ కార్యనిర్వాహక మండలి(ఈసీ) నిర్ణయం మేరకు కేవీ–హెచ్‌సీయూ ప్రాజెక్ట్ మోడ్ కింద కేవీఎస్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందన్నారు. ఇందులో భాగంగా హెచ్‌సీయూ ఇప్పటి వరకు కేంద్రీయ విద్యాలయపై రూ.20 కోట్లు వెచ్చించిందన్నారు. ఈ విద్యా సంవత్సరంతో ఒప్పందం ముగియనున్న నేపథ్యంలో కేంద్రీయ విద్యాలయను మూసి వేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు 2022 ఆగస్టులోనే కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు లేఖ రాసినట్లు వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయలో 8,9,10 తరగతులు మాత్రమే కొనసాగుతున్నాయని, విద్యార్థులకు క్యాంపస్ స్కూల్‌లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

జీ-20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్ నాలెడ్జ్ పార్టనర్‌గా ఐఎస్‌బీ


రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) జీ–20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్‌నకు నాలెడ్జి పార్ట్‌నర్‌గా మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్(ఎంఎస్‌డీఈ) ఆధ్వర్యంలోని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ)తో సహకరించేందుకు అంగీకరించారు. ఈ మేరకు మంగళవారం ఐఎస్‌బీ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్‌లో పరిశోధనలు, నాయకత్వ మద్దతును ఎన్ఎస్‌డీసీకి ఐఎస్‌బీ అందిస్తుంది. జీ–20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్ కోసం నాలెడ్జి కొలేటరల్‌ను రూపొందించడంలో ఐఎస్‌బీ సహాయం చేస్తుంది. ఐఎస్‌బీ డిప్యూటీ డీన్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ అండ్ డిజిటల్ లెర్నింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రొఫెసర్ దీపామణి మాట్లాడుతూ జీ–20ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్‌కి పరిశోధన, విజ్ఞాన మద్దతును అందించడం తమకు సంతోషంగా ఉందన్నారు. ఎన్ఎస్‌డీసీ సీఈఓ వేద్‌మణి తివారి మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ధోరణులకు సాక్ష్యంగా ఉన్నందున భారతదేశం కీలక సమయంలో జీ–20 అధ్యక్ష పదవిని చేపట్టిందన్నారు. ప్రపంచ నైపుణ్యాల అంతరాన్ని పరిష్కరించడానికి సామాజిక సమానత్వాన్ని మెరుగుపర్చడానికి, నైపుణ్య పర్యావరణ వ్యవస్థలో స్థిరమైన అభివృద్ధిని మెరుగు పర్చడానికి ఇది ప్రత్యేకమైన అవకాశం అన్నారు. జీ–20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్‌నకు నాలెడ్జ్ పార్టనర్‌గా ఐఎస్‌బీ ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఫొటో ప్రదర్శన

మాదాపూర్: అరకు ప్రాంతంలో గ్రామీణ జీవన విధానాన్ని తెలిపే ఫొటో ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో మంగళవారం మైలవరపు రమణి ఇన్‌విజుబుల్ రూట్స్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనను జేఎన్ఎఫ్ఏయూ ప్రొఫెసర్ ఆనంద్ గడప ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు, ఉదయం 10గంటల నుండి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



కాలక్షేపానికి వెళ్లి.. కుస్తీలో ఆరితేరి..



కుస్తీ పోటీలో కారుణ్య



సాధించిన పతకాలతో సుంకు కారుణ్య

- జాతీయస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారిణి
- ఒలింపిక్ మెడల్ లక్ష్యంగా ముందుకు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పురుషులే కఠినంగా భావించే కుస్తీ క్రీడను అవలీలగా నేర్చుకొని... జాతీయస్థాయిలో రాణిస్తోంది ఆ యువతి. ఆమె పోరాట పటిమకు దాసోహమంటూ బంగారు పతకాలు మెడలో ఆభరణంగా వచ్చిచేరుతున్నాయి. వేసవి సెలవుల్లో కాలక్షేపం కోసం నేర్చుకున్న కుస్తీనే ఆమెకు నేడు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రామచంద్రాపురానికి చెందిన సుంకు కారుణ్య.. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతుంది. పదో తరగతి అనంతరం వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండలేక గచ్చిబౌలిలో కుస్తీ క్రీడాశిక్షణ శిబిరంలో చేరింది. కోచ్ అందించిన మెలకువలను నేర్చుకున్న కారుణ్య, తండ్రి హరిబాబు ప్రోత్సాహంతో ప్రత్యేక శిక్షణతో తర్ఫీదు పొందింది.

పతకాల బాట

2017లో శిక్షణ పూర్తిచేసుకున్న కారుణ్య అదే ఏడాది నార్సింగ్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. 2018లో హర్యానాలోని సాయి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో పాల్గొంది. 2019 మహారాష్ట్రలో ఆరు నెలల ప్రత్యేక శిక్షణకు వెళ్లింది. ఆ సమయంలో అద్దె గదిలో ఉంటూ స్వయంగా వంట చేసుకుంటూ శిక్షణ పొందింది. అనంతరం ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని కాంస్యం సొంతం చేసుకుంది. 2022లో మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో బంగారు పతకం, హైదరాబాద్‌లో నిర్వహించిన కొత్వాల్ కేసరి కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించింది. జిల్లా, రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో 20 బంగారు పతకాలు, జాతీయస్థాయిలో కాంస్యం సాధించి సత్తా చాటుతోంది.

ఒలింపిక్ మెడల్ లక్ష్యం



కుస్తీ కఠినమైన క్రీడ అయినా.. ఎంతో ఇష్టంతో నేర్చుకున్నా. శిక్షణ సమయంలో నేర్చుకున్న మెలకువలతో పోటీల్లో పాల్గొనే ధైర్యం వచ్చింది. కుటుంబసభ్యులు ప్రోత్సహించడంతో జాతీయస్థాయిలో రాణిస్తున్నా. ప్రభుత్వం అండగా నిలిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా. ఒలింపిక్ మెడల్ సాధించడమే నా లక్ష్యం.

– సుంకు కారుణ్య, కుస్తీ క్రీడాకారిణి

మహిళలు ఐటీ రంగంలో రాణించాలి

- హైసియా ప్రెసిడెంట్ మనీషాసబూ
- వెస్టిన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



వెస్టిన్ హోటల్‌లో వేడుకలను ప్రారంభిస్తున్న మనీషాసబూ తదితరులు

మాదాపూర్: మహిళలు అన్ని రంగాలలో ఎదగాలని, ముఖ్యంగా ఐటీ రంగంలో రాణించాలని మనీషాసబూ (డెలివరీ హెడ్ ఇన్ఫోసిస్, హైసియా ప్రెసిడెంట్) తెలిపారు. మంగళవారం మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో దిగ్గజ మహిళా లీడర్లతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ వ్యక్తిగత అభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్య, ఆత్మరక్షణ, సాధికారతపై దృష్టి సారించే విధంగా బహుళ కార్యకలాపాలను ప్లాన్ చేసినట్టు తెలిపారు. క్యారమ్. చెస్, ఇండోర్‌గోల్ఫ్, వినోద పుస్తకాలతో లైబ్రరీ, ఇండోర్ గేమ్‌ల కోసం స్పోర్ట్స్ కార్నర్ వంటివి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై ప్రసంగించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ షబ్నంభక్షి, ఓపెన్ టెక్స్ట్ క్లౌడ్ సర్వీసెస్ డైరెక్టర్ పద్మినిరాజన్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతి హైస్కూల్‌లో..

మాదాపూర్‌లోని స్వాతి హైస్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్సీ సురభి వాణీదేవీ పాల్గొన్నారు. మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. పురుషులతో సమానంగా మహిళలు వ్యాపార రంగంలో కూడా రాణిస్తున్నారని, ప్రభుత్వం వారిని మరింత ప్రోత్సహించాలని కోరారు. ప్రిన్సిపల్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గజ్జెల యోగానంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



స్వాతి హైస్కూల్‌లో.. ఎమ్మెల్సీ వాణిదేవి తదితరులు

పరికి చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలి



పరికి చెరువును కాపాడాలని ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేసిన సభ్యులు

పరికి చెరువు పరిరక్షణ సమితి సభ్యులు

ఆల్విన్‌కాలనీ: పరికి చెరువును కబ్జాదారుల నుంచి కాపాడి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని పరికి చెరువు పరిరక్షణ సమితి సభ్యులు మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వినతిపత్రంలో కోరారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ భూదేవిహిల్స్ ఆనుకొని ఉన్న పరికి చెరువు సుమారు 50 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువులో ప్రైవేట్ వ్యక్తులు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను తీసుకువచ్చి చెరువును పూడ్చి కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

- మండల అధికారులు టిప్పర్లను, ట్రాక్టర్లను గుర్తించి పోలీస్ కేసులు పెడుతున్నప్పటికీ ఆగడం లేదన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ దిమ్మెలు కూడా కనిపించకుండా తొలగించారని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారుల అలసత్వం కారణంగా పూర్తిగా చెరువు కనుమరుగై పోతోందన్నారు.
- మండల అధికారులు అనేకసార్లు కబ్జాలకు పాల్పడిన ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టినా కూడా ఆక్రమణలు ఆగడం లేదు.
- నిజాం నవాబులు గొలుసు కట్టు చెరువుగా పంట పొలాలకు, తాగునీటికి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరికి చెరువును ఏర్పాటు చేశారని వినతిపత్రంలో తెలిపారు. పరికి చెరువులో పేరుకు పోయిన గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని పేర్కొన్నారు.
- వెంటనే గుర్రపు డెక్కను తొలగించి సుందరీకరణ పనులు చేపట్టి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల యాదగిరి, సత్యనారాయణ, సుదర్శన్, నాగేశ్వరరావు, ప్రసాద్, పలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్నేహితుడి కోసం వెళ్లిన వ్యక్తిపై దాడి

పటాన్‌చెరు టౌన్: రూ.ఐదు వేల అప్పు గొడవలో స్నేహితుడి కోసం వెళ్లి మాట్లాడితే ఆ యువకుడిపై దాడి చేసి తల పగలగొట్టాడు. ఈ ఘటనలో యువకుడికి తొమ్మిది కుట్లు పడ్డాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం .. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సాయికాలనీకి చెందిన ప్రవీణ్‌కు ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి పటాన్‌చెరు పట్టణంలోని ఆల్విన్‌కాలనీలో ఉండే స్నేహితుడు రూపేశ్‌సింగ్ ఫోన్ చేశాడు. అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్‌కు చెందిన కలీంతో పాటు అమీర్, షేఖ్‌గౌస్‌లు కారులో వచ్చి తనను తీసుకొని వెళ్తున్నారని ఫోన్ చేయడంతో ప్రవీణ్ స్నేహితుడి కోసం పటాన్‌చెరు వచ్చి బస్టాండ్ సమీపంలో స్నేహితుడు ఉన్నట్లు తెలుసుకొని ఘటనా స్థలానికి వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లిన ప్రవీణ్ నా స్నేహితుడిని ఈ సమయంలో ఎందుకు కారులో తీసుకెళ్తున్నారని అడగటంతో అప్పుడే బైక్‌పై వచ్చిన కలీం స్నేహితుడు లడ్డు తన వెంట తెచ్చుకున్న రాడ్‌తో ప్రవీణ్ తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో ప్రవీణ్ తల పలగగా చికిత్స కోసం పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు తొమ్మిది కుట్లు వేశారు. తర్వాత బాధితుడు ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భారత్ సూపర్ పవర్‌గా ఎదగడానికి సమష్టి కృషి అవసరం

నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్



డాక్టర్ వికే సారస్వత్‌కు జ్ఞాపికను అందిస్తున్న మాజీ వీసీ ప్రా. అప్పారావు, వీసీ బీజేరావు

రాయదుర్గం: పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించేందుకు, అభివృద్ధి చేసేందుకు విద్యాసంస్థలు తోడ్పడాలని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో 'ఎస్పైర్' సంస్థ 5వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఫౌండేషన్ లెక్చర్ కార్యక్రమంలో భాగంగా 'ఇండియాస్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ భారతదేశం సూపర్ పవర్‌గా ఎదగడానికి ఉత్పత్తి ఆధారిత లోతైన సాంకేతిక ఆవిష్కరణల అభివృద్ధి, స్టార్టప్‌లు, పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో, చుట్టుపక్కల ఉన్న వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో ఎస్పైర్ ప్రయత్నాలను ప్రశంసించారు. అనంతరం ఎస్పైర్ ఇంక్యుబేటర్‌లో ఏర్పాటు చేసిన స్టార్టప్‌లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ పరిశోధనా సంస్థల అధిపతులు, ఫార్మా అండ్ బయోటెక్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, హెచ్‌సీయూ స్టార్టప్ కమ్యూనిటీ సభ్యులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'గీతం'కు హరితహారం అవార్డు



అవార్డు అందుకుంటున్న గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ

పటాన్‌చెరు టౌన్: రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి హరితహారం అవార్డు వచ్చినట్టు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు మంగళవారం తెలిపారు. హరితహారంలో భాగంగా 2022 సంవత్సరంలో గీతం ప్రాంగణంలో 33 వేలకు పైగా మొక్కలు నాటినందుకు జాతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ విభాగం మార్చి 7న నిర్వహించిన వార్షిక సదస్సులో ఈ అవార్డు ప్రదానం చేసినట్టు తెలిపారు. ఈ అవార్డును హైదరాబాద్ పరిశోధన, ఆవిష్కరణల సర్కిల్(ఆర్ఐసీహెచ్) డైరెక్టర్ జనరల్ అజిత్ రంగ్నేకర్, క్రెడాయ్ పూర్వ జాతీయ అధ్యక్షుడు శేఖర్ చేతుల మీదుగా గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీఎస్ కుమార్ అందుకున్నట్టు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భారతీనగర్ డివిజన్ పరిధి పాత ఎంఐజీ కాలనీ శివారులోని బీహెచ్ఈఎల్‌లో మూతబడిన డ్రైనేజీ సంపులో గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం సాయంత్రం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి జేబులో లభించిన ఫోన్ బుక్ ఆధారంగా పటాన్‌చెరులో నివాసముండే బిహార్‌కు చెందిన జితేంద్రకుమార్ శర్మగా గుర్తించారు. మృతుడు కూలి పనులు చేస్తున్నాడు. కాగా ఇక్కడికి వచ్చి ఎలా మృతి చెందాడనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని, నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూజీడీ పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధి జ్యోతినగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కౌన్సిలర్ చంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని, పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సీతామహాలక్ష్మి, రాజు, శారద, విజయ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న చంద్రారెడ్డి

అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్, ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్‌లలో చేపట్టిన సీసీ రోడ్ల పనులను మంగళవారం తెల్లవారుజామున ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకుల్ ప్లాట్స్, ప్రేమ్‌నగర్‌లో సుమారు రూ.1.15 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బ్రిక్ శ్రీనివాస్, గుమ్మడి శ్రీనివాస్, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, రజినీకాంత్, ఖాసీం, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్‌లో..

ఆదిత్యనగర్ ముస్లిం శ్మశానవాటికను మంగళవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పరిశీలించారు.

ఉరేసుకొని పూజారి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

మియాపూర్: ఓ పూజారి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన ప్రకారం.. మర్రిగంటి ప్రశాంత్ (30) భార్య ప్రసన్న ఇద్దరు పిల్లలతో మియాపూర్‌లో నివాసముంటున్నారు. స్థానికంగా హనుమాన్ ఆలయంలో పూజారి. కొంతకాలంగా తల్లి, సోదరిలతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. ఎవరు లేని సమయంలో తల్లి రూప గదికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఎంత సేపైనా బయటకు రాకపోవడంతో భార్య ప్రసన్న వెళ్లి తలుపు తట్టగా ఉలుకు పలుకు లేదు. దీంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతనిని కిందికి దించి దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి ప్రశాంత్ మృతి చెందాడని తెలిపారు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. తల్లి, సోదరి వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ప్రసన్న మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుని భార్య ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉచిత మేకప్, మేకోవర్...

- ఇనార్బిట్‌లో 5 రోజులపాటు మహిళా దినోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: మహిళల కోసం ప్రత్యేకించిన పలు కార్యక్రమాలతో మహిళా దినోత్సవాలను 5 రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు ఉచిత మేకప్, మేకోవర్, ఉచిత స్టైలింగ్, పాప్ అప్ బూత్స్, స్పెషల్ ఫొటో బూత్స్...వంటివి అందుబాటులోకి తెచ్చామని, తమ రివార్డ్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా గానీ లేదా ఫోన్ నంబర్ 7998079980కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ఈ ఆఫర్లను వినియోగించుకోవచ్చునన్నారు.

హోలీ సంబరాలు



మసీదుబండలో వేడుకల్లో మహిళలు, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్



శేరిలింగంపల్లిలో..



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో..

శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో మంగళవారం హోలీ సంబరాలు చేసుకున్నారు. ఉదయం నుంచే చిన్నా పెద్దా రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

– శేరిలింగంపల్లిజోన్ బృందం



రాయదుర్గం శ్యామ్‌లెట్ వీధిలో కాముడి దహనం



చందానగర్‌లో..